అభివృద్ధి పనులు వేగవంతం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో అడపా లవరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో చేపడుతున్న పనులను జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవడానికి అవసరమైన నిధులు, మెటీరియల్‌ను అందిస్తున్న దృష్ట్యా.. మంజూరైన అన్ని ఇళ్లు పూర్తయ్యేలా చూడాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా వివిధ గ్రామాలకు మంజూరైన మంచినీటి పథకాలను వీలైనంత తొందరగా అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణం

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో మంజూరైన జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ దంతులూరి వాసురాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో పూర్తి చేయాల్సిన ఇళ్ల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పలు గ్రామాల్లో ఇంకా అనేక అభివృద్ధి కార్యాక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల విషయంలో కచ్చితంగా నాణ్యత పాటించాలని సూచించారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలను కూడా ఈ పనుల్లో భాగస్వాములు చేయాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలు ప్రస్తావించగా.. ఆ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీడీవో వి. జానకి పాల్గొన్నారు.



భీమిలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



ఆనందపురం మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొమ్మాది: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని.. ఇందులో భాగంగా గడపగడపకు వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం తదితర ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే చదువు, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నామని.. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా సరి సమానంగా సాగుతోందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలు విన్నవించుకున్నారు. వీధిలైట్లు, పలు చోట్ల డ్రైనేజీలు ధ్వంసమయ్యాయని, అక్కడక్కడ మంచినీటి సమస్యలు తెలుపగా వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, గాదె రోశిరెడ్డి, రేణుక, వరలక్ష్మి పాల్గొన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నేడు

తగరపువలస: చిట్టివలస వార్డు సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు భీమిలి జెడ్సీ బి.రాము తెలిపారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. స్థానికులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్సీ కోరారు.

నగరానికి వెళ్లి.. పింఛన్ అందజేసి..

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం ఎన్టీఆర్ కాలనీలోని 41వ వార్డు సచివాలయం పరిధి వలంటీర్ పోతిన సాయినాథ్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ సచివాలయం పరిధిలోని కొంపెల్లి అమ్మాజీకి కాలికి గాయం కావడంతో నగరంలోని ఓమ్నీ ఆర్కేలో చికిత్స పొందుతోంది. దీంతో సాయినాథ్ ఆస్పత్రికి వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3 వేలు ఆమెకు అందజేశారు.



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం అందజేస్తున్న సాయి భక్తుడు

మధురవాడ: పీఎంపాలెం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. మధురవాడ ఎంవీవీ సిటీ సాయి సెంటర్ భక్తులు పండ్లు, పౌష్టికాహారం, స్వామి వారి విభూతి, ఇతర సామగ్రి సమకూర్చగా.. సాయిదూత ప్రభాకర్ వీటిని గర్భిణులకు అందించారు. సాయి భక్తులు చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

అయోధ్య రాములోరి అక్షింతల పంపిణీ



గుడిలోవలో శ్రీరాముని పూజా అక్షింతల ఇంటింటికీ పంపిణీ చేస్తున్న భక్తులు

ఆనందపురం: గుడిలోవలో మంగళవారం అయోధ్య శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. గుడిలోవ విజ్ఞాన విహార ప్రాంగణంలోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి భజంత్రీలు, భజనలతో పల్లకీలో హనుమత్ సమేత సీతారామలక్ష్మణ విగ్రహాలను ఊరేగించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. భక్తులు సూర్యారావు, రమేష్, మహేష్, బాలి రవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

క్షీణించిన దంతాలనూ రక్షించవచ్చు

ఇటలీ వైద్యుడు గియోవన్నీ

కొమ్మాది: గీతం దంత వైద్య కళాశాల, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ విశాఖ శాఖ సంయుక్తంగా మంగళవారం దంత వైద్యంలో నూతన విధానాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇటలీకి చెందిన ప్రఖ్యాత దంత వైద్య నిపుణుడు డా.గియోవన్నీ కావల్లి.. క్షీణించిన దంతాలను కూడా చికిత్స ద్వారా ఏ విధంగా సరిచేయవచ్చో వివరించారు. వైద్యులు నిరంతరం వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్ తదితరులు పాల్గొన్నారు.

• కమనీయం.. దీప వైభవం



అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అత్యంత వైభవంగా దీపోత్సవం నిర్వహించారు. ముందుగా అష్టలక్ష్మి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ఆలయ ధర్మకర్తలు సత్యనారాయణమూర్తి, రమాదేవి దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - కొమ్మాది

22 వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

ఆర్డీవో భాస్కరరెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: నియోజకవర్గ పరిధిలో ఇంకా ఓటర్లుగా చేరేందుకు అవకాశం ఉందని ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు నియోజకవర్గ స్థాయిలో కొత్తగా నమోదు చేసుకున్న వారితో కలిపి మొత్తం 3.59 లక్షల మంది ఓటర్లుగా ఉన్నారని వెల్లడించారు. అర్హత కలిగి ఉన్న వారు ఓటర్లుగా నమోదు కావడానికి ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఉందన్నారు. నియోజకవర్గ స్థాయిలో 348 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, అన్ని బూత్‌ల్లోనూ పూర్తిగా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా పార్టీల నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, కదిరి ఎల్లాజీ, చంద్రశేఖర్, ఎ.సూర్యప్రకాష్, గంటా నూకరాజు, డి.ఎ.ఎస్ రాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ముప్పు

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 కార్యాలయం(మధురవాడ)లో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగింది. నైట్ వాచ్‌మన్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ముప్పు తప్పింది. ఇక్కడ అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో కార్యాలయం నుంచి పటపటమంటూ శబ్దం, మంటలు రావడంతో నైట్ వాచ్‌మన్ ఎల్లారావు గమనించారు. వేరే సిబ్బంది ద్వారా విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో వారు ఈ ప్రాంతంలో విద్యుత్ నిలుపుదల చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని జోనల్ కార్యాలయ విద్యుత్ కనెక్షన్ తప్పించారు. ఇక్కడ మెయిన్ స్విచ్, మీటర్, ఫీజు కటౌట్‌లు వంటివి పూర్తిగా కాలిపోయాయి. మంటలు వ్యాపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కిడ్నీ బాధితుడికి రూ.10వేల సాయం

నిత్యావసర సరకుల అందజేత

సాక్షి ఎఫెక్ట్..

ఆనందపురం: వెల్లంకి ఎస్సీకాలనీకి చెందిన బవిరిశెట్టి వెంకటరావుకు పలువురు దాతలు సాయం చేశారు. 'సాక్షి'దినపత్రికలో 'పేద కుటుంబానికి పెద్ద కష్టం'శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ తరఫున సభ్యుడు భోగేష్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసింది. వెంపాడ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు వెంకటరావు కుటుంబానికి నిత్యావసర సరకులు అందించారు. గంభీరంలోని ఓఎస్‌జీ ఫౌండేషన్ సభ్యులు వెంకటరావు కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. పలువురు దాతల నుంచి ఇంత వరకు రూ.11 వేల వరకు సేకరించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివదలాయి తెలిపారు. దాతలు తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు వెంకటరావు కోరారు.



నగదు అందిస్తున్న స్నేహాంజలి సంస్థ సభ్యుడు

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం బంతి పువ్వులు, గాజు అద్దాలతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చేసిన ఈ అలంకరణకు చిప్పాడకు చెందిన సాడి శంకర్‌రెడ్డి, రమాదేవి దంపతులు ఆర్థిక సాయం అందించారు. చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరెడ్డి అమ్మవారిని అలంకరించారు. అలాగే భీమిలి మండలం మజ్జివలస రాసపోలమాంబ అమ్మవారిని చాక్లెట్లతో అలంకరించారు. ఈ అలంకరణకు అదే గ్రామానికి చెందిన బట్టు రఘు, హేమలత సహాయ సహకారాలు అందించగా.. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదం పంపిణీ చేశారు.



అద్దాల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి



చాక్లెట్ల అలంకరణలో రాస పోలమాంబ

పేదలకు దుప్పట్లు, చీరల వితరణ

తగరపువలస: వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తన కుమారుడు తేజేశ్వరరావు రెండవ వర్ధంతి సందర్భంగా మంగళవారం లక్ష్మీపురంలో 500 మంది పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను ప్రారంభించారు.

కాళ్ల అప్పలసూర్యనారాయణ, ఏఎంసీ అధ్యక్షుడు ఎలమంచిలి సూర్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, యూత్ విభాగం మండల అధ్యక్షుడు చిల్ల హరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లచ్చుబుగత జగదీశ్వరరావు, సమ్మిడి శ్రీనివాసరావు, కాద సూర్యనారాయణ తదితరులు ఆపల్గొన్నారు.



చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాసురాజు, వైస్ ఎంపీపీ బంగారునాయుడు

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



లక్ష్మీపురంలో కేస్‌షీట్లు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

తగరపువలస: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. భీమిలి మండలం లక్ష్మీపురంలో మంగళవారం జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్యసిబ్బంది ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని క్షుణ్ణంగా పరీక్షలు చేసి.. వారికి తగిన మందులు అందేలా చూడాలన్నారు. వీరిని సంబంధిత నెట్‌వర్క్ ఆస్పత్రులకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కేస్‌షీట్లు, ఓపీ నమోదు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

450 మందికి వైద్యసేవలు

తాళ్లవలస పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఎ.బి.మల్లికార్జునరావు, శోభారాణి, ప్రత్యేక వైద్యులు సౌజన్య, శ్రీ ప్రియ, సుబ్బలక్ష్మి, ప్రసాద్, ప్రియాజీ, ఆరోగ్య విస్తరణాధికారి రాజ్‌కుమార్ తదితరులు శిబిరంలో 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, గాడు తాతినాయుడు, కరుభుక్త వెంకటరమణ, పూసర్ల ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

752 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం: బి.ఆర్.తాళ్లవలసలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 752 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందుగా ఈ శిబిరాన్ని సర్పంచ్ చందక శ్రీనివాసరావు ప్రారంభించారు. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ చందక పైడినాయుడు, ఈవోఆర్డీ కుమార్, వైద్యులు కల్యాణి, రాబర్ట్ రవీంద్ర, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చిందే.. తుమ్మెదా!



కుర్రోకుర్రు.. సోది చెబుతానమ్మా.. సోది

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని ది సెడార్ పాఠశాలలో మంగళవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా భోగి మంటలు వేశారు. హరిదాసు కీర్తనలు, సంప్రదాయ నృత్యాలు, ఇతర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీడీవో సునీత్ కొమన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన సంప్రదాయాలు, ఆచారాలను పాటించి గౌరవించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.ఎస్.నవీన్‌కుమార్, ఎ.ఒ.మంజుల, హెచ్‌ఆర్ మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయి రవీంద్ర పాఠశాలలో..

తగరపువలస: సాయిరవీంద్ర పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. విద్యార్థులు భోగి మంటలు వేసి, రంగవల్లులు తీర్చిదిద్ది గాలిపటాలు ఎగురవేశారు. కోలాటం, హరిదాసుల వేషధారణ, కొమ్మదాసరి, బసవన్న, అష్టలక్ష్ముల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తప్పెటగుళ్లు, కర్రసాము, పులివేషాల ద్వారా పండగ విశిష్టతను తెలియజేశారు.

సంతపేట అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాలలో డ్యాన్స్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం మొకర పద్మావతి, ఉపాధ్యాయులు జి.దుర్గాప్రసాద్, కె.లీలామణి, వై.వెంకటేష్, డీవీ రమేష్, కె.ఇందిర, జె.శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇళ్లు భద్రం

పీఎంపాలెం క్రైం సీఐ సురేష్

మధురవాడ: సంక్రాంతి పురస్కరించుకుని సొంత ఊళ్లు, విహార యాత్రకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీఎంపాలెం క్రైం సీఐ సురేష్ సూచించారు. మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం పీఎంపాలెం స్టేషన్ సిబ్బంది కరపత్రాలు పంచి.. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇళ్లల్లో ఎవ్వరూ లేనప్పుడు దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అందుకే విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో దాచుకోవాలన్నారు. పోలీసులకు సమాచారం ఇస్తే.. ఇంట్లో ఉచితంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. బయటకు వెళ్లే సమయంలో జేబు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు, నాలుగు చక్రాల వాహనాలను పార్కింగ్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బంగారు భవిష్యత్తుకు మళ్లీ జగనే సీఎం కావాలి

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర పూర్తి చేసి ఐదేళ్లు అయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ భీమిలి నాయకులు మంగళవారం టి.నగరపాలెం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దంతులూరి వాసురాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. తిరిగి ఆయనే 2024లో ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ పొట్నూరు చంద్రశేఖర్, ఎంపీటీసీలు పల్లా సన్యాసిరావు, చెల్లూరి నగేష్‌బాబు, పార్టీ అధ్యక్షుడు బాయిన మంగరాజు, రాజగిరి రామచంద్రరావు పాల్గొన్నారు.



టి.నగరపాలెం వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

15న మకర జ్యోతి దర్శనం

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఈ నెల 15న సాయంత్రం మకర జ్యోతి దర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. ఆనవాయితీ ప్రకారం ఆ రోజు మధ్యాహ్నం స్వామిని అశ్వవాహనంపై ఊరేగిస్తామన్నారు. ఆలయ ధర్మకర్త పాండే పర్యవేక్షణలో మకర జ్యోతి కార్యక్రమం, ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు. కమిటీ అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రినాయుడు, ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు పాల్గొన్నారు.

14న సింహగిరిపై గోదా కల్యాణం

సింహాచలం: భోగి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 14న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో గోదా కల్యాణాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి కల్యాణ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం జరిగే నిత్యకల్యాణం కూడా గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న మకర సంక్రాంతి పురస్కరించుకుని ఉత్తరాయణం పుణ్యకాలం పూజలు సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు ఉండవన్నారు. 16న కనుమ పురస్కరించుకుని కొండదిగువ పూలతోటలో గజేంద్రమోక్షం ఉత్సవం ఉంటుందన్నారు. ఆ రోజు సింహగిరిపై సాయంత్రం 4 గంటలకి స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కొండ దిగువకి తీసుకెళ్తామన్నారు. గజేంద్రమోక్షం ఉత్సవం అనంతరం రాత్రి అడవివరం పుర వీధుల్లో స్వామిని గజవాహనంపై తిరువీధి నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవం సందర్భంగా 16న సాయంత్రం 6 గంటల తర్వాత సింహగిరిపై స్వామి దర్శనాలు లభించవన్నారు. తిరిగి 17న ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు ఉంటాయన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే సాయంత్రం 7 గంటల తర్వాత దర్శనాలు లభించవన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

తగరపువలస: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందరివాడని ఎస్సీ సెల్ పూర్వ అధ్యక్షుడు పందిరి విజయకుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఈ నెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా మంగళవారం సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్, గాంధీజీ ఆశయాలను కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సచివాలయ అడ్మిన్ ఉప్పాడ ఆదిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమ్మల ప్రసన్న, పందిరి శ్రీధర్, రాజు, తారకేశ్, సారిక చిరంజీవి, చేతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. భీమిలి మండలం తాళ్లవలస సచివాలయంలో కూడా సంతకాల సేకరణ జరిగింది.



శ్రీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంతకాల సేకరణలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

తగరపువలస: భీమిలి మండలం బోడమెట్టపాలెం, దాకమర్రి పంచాయతీల్లో మంగళవారం వికసిత్ భారత్ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు రఘునాథ్, ప్రియాంక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో కేంద్ర ప్రచార సమాచార అధికారులు రోగిస్ సోధి, దల్‌బీర్ సింగ్, తారక్ ప్రసాద్, హెన్రీ రాజ్ తదితరులు మాట్లాడారు. పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, జల్‌జీవన్ మిషన్, పోషక అభియాన్ తదితర సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్‌లు చెల్లూరి పైడప్పడు, ముద్దాడ అప్పయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, బీజేపీ భీమిలి కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, ఉప్పాడ అప్పారావు, బండారు అనిల్‌కుమార్, పి.వి.వి ప్రసాదరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుకతో భరోసా

తగరపువలస: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కొనసాగుతోంది. సంతపేటలో మంగళవారం వలంటీర్ జామి ప్రసాద్ సమక్షంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిల్లా వంశీరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి, సరగడ చెన్నకేశవరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, ఉప్పాడ నానిరెడ్డి తదితరులు పింఛన్లు అందించారు.